# ఏకత్వాన్ని గుర్తింపజేయునదే నిజమైన విద్య

విశ్వశాంతిని చేకూర్చు విధము నేర్పి
సంకుచిత భావముల నెల్ల సమయజేసి
ఐకమత్యము సహజీవనాదికములు
సమత నేర్పుటయె కాదె సరస విద్య

ప్రేమస్వరూపులైన విద్యార్థులారా! విద్యార్థినులారా! విద్యాపోషకులారా! విద్యాధికారులారా! ఈనాడు లోకమునకు కావలసినది ధనము కాదు. భోగభాగ్యములు కాదు. ఆదర్శప్రాయులై సమాజ సంక్షేమానికి పాటుపడే విద్యార్థినీ విద్యార్థులు కావాలి. ఆలోచించగల్గిన ప్రతి మానవుని అయోమయ స్థితిలో ముంచెత్తే అనేక సమస్యలు నేడు విద్యారంగంలో పెరిగిపోయినవి; సమాజ సంక్షేమాన్ని ఆశించే విద్యార్థులు కరువైపోయారు. విద్యార్థులు కేవలం కలిమి, చెలిమి, బలములను ఆశిస్తున్నారేగాని, గుణమును పోషించుకోవటానికి ప్రయత్నించటం లేదు.

సమాజానికి సేవ చేయటమంటే ఏదో పరులకు సేవ చేయడమని భావించటం పొరపాటు. "సర్వతః పాణిపాదం తత్సర్వతోక్షి శిరోముఖం సర్వతః శృతిమల్లోకే సర్వమావృత్య తిష్ఠతి" ప్రపంచమంతా వ్యాపించియున్న శక్తి ఒక్కటే. అణువునందు, ఘనమునందు ఉన్న శక్తి ఒక్కటే. అదియే Cosmic Divine. మీ యందున్న దివ్యచైతన్యశక్తియే ప్రజలందరియందున్నది. విశ్వమంతయు ఈ దివ్యచైతన్యశక్తియే వ్యాపించియున్నది. ఈ పరమ సత్యాన్ని గుర్తించిన వ్యక్తులు పెడమార్గం పట్టటానికి అవకాశం లేదు. ఈనాడు లోకంలో ఎన్నో కోట్లమంది విద్యావంతులు మేధావులు, పండితులు ఉన్నారు. కాని, వారివల్ల జగత్తుకు జరుగుతున్న ఉపకారమేమిటి? ఎవరి స్వార్థాన్ని వారు చూసు కుంటున్నారు. దేశంకోసం పాటుపడే వ్యక్తులు చాలా అరుదుగా ఉన్నారు.

**రూపనామములపై భ్రాంతిని వీడండి**

మానవుడనగా కేవలం దేహమనోబుద్ధుల చేరిక కాదు. ఇవి ఉపాధులు మాత్రమే. దేహము జడము. మనస్సు నెగెటివ్. జడమైన దేహమే నని భావించటం పొరపాటు. మానవుడు

srisathyasaivachanamrutam

వచ్చేవాడూ కాదు, పోయేవాడు కాదు. సర్వకాల సర్వావస్థలయందున్నవాడు మానవుడు. మానవునికి జనన, మరణములు లేవు. దేహము మార్పు చెందుతుందిగాని, మానవునికి మార్పులేదు. 'నరః' అనేది మానవునికి గల మరొక పేరు. 'రః' అనగా నాశనము. కనుక, నాశనము కాని ఆత్మస్వరూపుడే నరుడు. ఆత్మకు ఎట్టి మార్పులూ లేవు. ఎట్టి కూర్పులూ లేవు. అట్టి ఆత్మస్వరూపుడైన మానవుడు మరణానికి భయపడటమెందుకు? సుఖానికి పొంగటమెందుకు? దుఃఖానికి కృంగటమెందుకు? ఇవన్నీ లౌకికమైన, ప్రాకృతమైన క్రియలే. ఇవన్నీ నెగెటివ్ క్రియలే. కాని, మానవుడు పాజిటివ్. అనగా సత్యమైనవాడు, నిత్యమైనవాడు. అలాంటివాడు అసత్యమైన, అనిత్యమైన విషయాలనెందుకు అనుసరిస్తున్నాడు? తానేదో గొప్ప చదువులు చదువుతున్నానని విఱ్ఱవీగుతున్నాడు. కాని, ఈ చదువులన్నీ కొంతకాలానికి కనుమరుగైపోయేటటువంటివే! ఇవి ప్రాకృతమైన జీవితానికి మాత్రమే సహాయపడతాయి. ఈ చదువుతోపాటు అంతర్ముఖమైన ఆత్మతత్త్వాన్ని గుర్తించాలి. ఆత్మశక్తియే దివ్యశక్తి. ఈ దివ్యశక్తి లేని ప్రదేశమే లేదు; ఈ దివ్యశక్తి లేని వ్యక్తియే కనిపించదు. దీనినే Cosmic Divine అన్నారు. ఈనాటి సైంటిస్టులు అనేక పరిశోధనలు చేస్తున్నారు. కాని ఆ పరిశోధనలవల్ల కల్గిన ఫలితమేమిటి? కేవలం అనిత్యమైన, అశాశ్వతమైన విషయాలనే తెలుసుకుంటున్నారు. సర్వత్ర ఉన్న దివ్యశక్తిని గుర్తించుటకు ప్రయత్నించాలి. అట్టి ఏకత్వాన్ని గుర్తించినవారికి ఎట్టి బాధలు ఉండవు. ప్రపంచమంతయు ఏ దివ్యశక్తి నిండియున్నదో ఆ దివ్యశక్తి అంతయు ఒక చిన్న వ్రేలియందుకూడ ఉన్నది. కాని మీరు రూపనామములపై భ్రాంతితో ఒక చిన్న వ్రేలియందు అంతటి గొప్ప శక్తి ఎలా ఉండగలదని అనుమానిస్తున్నారు, తద్వారా బలహీనులైపోతున్నారు. రూపనామములపై భ్రాంతిని త్యజించి దివ్యశక్తిని గుర్తించండి. అప్పుడు మీకు ఎనలేని బలము చిక్కుతుంది.

ప్రేమస్వరూపులారా! ప్రేమయే ప్రాణము. ప్రేమచేత సాధించలేనిది ఈ జగత్తులో ఏదీ లేదు.

ఏ ప్రేమశక్తిచే ఈ ధారుణీ చక్ర
మిరుసు లేకుండగా తిరుగుచుండు
ఏ ప్రేమశక్తిచే నెల్లనక్షత్రాలు

sri sathyasai vahini.org

నేలరాలక మింట నిలిచియుండు
ఏ ప్రేమశక్తిచే ఈ పుడమిపై బడక
కడలిరాయడు కాళ్ళుముడుచుకొనియె
ఏ ప్రేమశక్తిచే ఈరేడు లోకాలు
గాలిదేవుడు సురిటీలు విసరె

ఆ మహాప్రేమశక్తియే ఆత్మశక్తి
అద్భుతమనంతమద్వితీయమగుశక్తి
నిండియున్నది బ్రహ్మాండ భాండమెల్ల
ఈ మహాసృష్టియంతయు ప్రేమమయమె!

ప్రేమయే లేకుండిన మానవత్వమనేదే కనిపించదు. ఆకారమునుబట్టి మీరు భేదమును పెంచుకుంటున్నారుగాని, మానవత్వము ఆకారమునకు సంబంధించినది కాదు; ఆచరణకు సంబంధించినది. ఆచరణలో పెట్టినప్పుడు మీకు అనంతమైన ఆనందము ప్రాప్తిస్తుంది.

ఎన్ని విద్యలు నేర్చిన నేమి ఫలము?
నొసటి వ్రాతను తప్పింప నెవరి తరము?
చెడ్డ బుద్ధులు తన తల జేరెనేని
ఎండబారును బుద్ధులు బండబారు

కనుక, చెడ్డ భావములకు చోటివ్వకూడదు. మనస్సే మనిషిగా మారుతుంది. మానవుడే మాధవుడుగా రూపొందుతాడు. మానవునియందు ఏ దివ్యశక్తి ఉన్నదో మాధవునియందు అదే శక్తి ఉన్నది. కాబట్టి మానవుడు వేరు, మాధవుడు వేరు కాదు. మానవుడొక రూపాన్ని ధరించియుండుటచేత రూపమే తానని విశ్వసిస్తున్నాడు. రూపాన్ని విశ్వసించవద్దు. అందులోని దివ్యశక్తిని విశ్వసించాలి. ఆ దివ్యశక్తినే అనుసరించాలి. ఆ దివ్యశక్తి 'నేను' గా తమయందే ఉందని గుర్తించుకోలేక అనేకమంది అనేకవిధములైన సాధనలు చేస్తున్నారు.

**సమత్వమే నిజమైన వేదాంతం**

ఈ ప్రపంచంలో ఉన్నది ఒక్కటే. దానికి అనేక పేర్లు పెడుతున్నారు. కనుకనే వేదము "ఏకంసత్ విప్రాః బహుధా వదంతి" అన్నది. చూడండి. ఇక్కడున్న బల్బులు, ట్యూబులు,

sri sathyasaivachanamrutam

మైకుల రూపనామములు వేరువేరుగా ఉన్నప్పటికీ వీటన్నింటిలో ప్రసరించే కరెంటు ఒక్కటే కదా! అదేరీతిగా, రూపనామములు వేరువేరని భావించకూడదు. అందరియందున్న చైతన్యమొక్కటే! రూపనామములు, భావములను పురస్కరించుకొని మీరు భేదములను పెంచుకుంటున్నారు. కాని, ఉన్నది ఒక్కటే. అదే అనేకంగా కనిపిస్తున్నది. దానినే అనేకంగా అనుభవిస్తున్నాము. ఈ ప్రపంచమంతయు నిండిన శక్తి ఒక్కటే! అయితే, అనాది కాలమునుండి మీరు రూపనామములను అనుభవిస్తూ రావటంచేత మీకు భేదములు కనిపిస్తున్నాయి. రూపనామములే మిమ్మల్ని అనేక విధములుగా భ్రమింపచేస్తున్నాయి. ఊహింపచేస్తున్నాయి; అనేక సందేహాలకు అవకాశం ఇస్తున్నాయి. రూపనామములను ప్రక్కకు నెట్టివేస్తే ఉన్న శక్తి ఒక్కటే అని స్పష్టమౌతుంది. అప్పుడు అసత్యానికిగాని, కోపతాపాలకు గాని ఏమాత్రమూ అవకాశం ఉండదు. అంతటా సమత్వం గోచరిస్తుంది. సమత్వమే నిజమైన వేదాంతం. సమత్వాన్ని గుర్తించనంతవరకు సుఖాన్ని పొందలేము. కనుకనే వేదముకూడా "సహనావవతు, సహనౌభునక్తు సహవీర్యం కరవావహై తేజస్వి నావధీతమస్తు మావిద్విషావహై" అని బోధించింది. ఏమిటి దీని అంతరార్థం?

కలిసి మెలసి పెరుగుదాం, కలసి మెలసి తిరుగుదాం
కలసి మెలసి తెలుసుకున్న తెలివిని పోషించుదాం
కలసి మెలసి కలత లేక చెలిమితో జీవించుదాం

మానవుడు ఆత్మస్వరూపుడు. ఆత్మ అనగా ఏమిటి? ఇదంతా శక్తియే. కరెంటుకొక రూపం లేదు. అది బల్బులో చేరి ప్రకాశాన్ని చేకూర్చుతుంది. ఫ్యాన్‌లో ప్రవేశించి గాలిని అందిస్తుంది; స్టవ్‌లోచేరి వంటకు సహాయ పడుతుంది. "ఆహా! కరెంటా! నాకెంత ఉపకారం చేస్తున్నావు!"అని కృతజ్ఞతతో దానిని ముట్టుకుంటే 'షాక్' కొడుతుంది. దానికి శక్తి ఉన్నది. అదేరీతిగా ఆత్మకు రూపం లేదుగాని, శక్తి ఉన్నది. దీనినే Cosmic engergy అన్నారు. దానికోసం ఎక్కడికోపోయి వెతుకనక్కర్లేదు. మన దేహంలోకూడా ఉన్నది. భస్మాసురుడు ఎవరి నెత్తిపై చేయి పెడితే వారు భస్మమైపోయేవారట. అదియే Cosmic engergy.

**లేత వయస్సునందే ఆధ్యాత్మికంలో ప్రవేశించాలి**

ఈనాటి మానవుడు ఎంతో Engergy (శక్తి) ని వ్యర్థం చేస్తున్నాడు. మానవుడు తనకున్న

sri sathyasai vahanamrutam

Knowledge (విషయపరిజ్ఞానము) ను Skill (సద్వినియోగం) చేయాలి. అప్పుడే అంతర్దృష్టి అలవడుతుంది. అంతర్దృష్టి ఉన్నప్పుడే జీవితంలో Balance (సమతుల్యం) ఉంటుంది. కాని, ఈనాటి మానవుడు తనకున్న Knowledge ని Skill చేసేబదులు kill (దుర్వినియోగం) చేస్తున్నాడు. కనుకనే అతని దృష్టి బహిర్ముఖమై జీవితంలో Balance ను కోల్పోతున్నాడు Balance తప్పిపోవటంచేత చంచలత్వంతో జీవిస్తున్నాడు. మానవుడు జీవితంలో Balance ను పోషించుకోవాలంటే తనకున్న Knowledge ను సద్వినియోగం చేయాలి. దేహాభిమానంవల్లనే మానవునికి అనేక బాధలు కల్గుతున్నాయి. కనుక దేహాభిమానమును అదుపులో పెట్టుకొని, దుర్భావాలను ప్రక్కకు నెట్టి, ఆత్మాభిమానమును పెంచుకోవాలి. చాలామంది, "ఏమిటిది, స్వామి చిన్నపిల్లలకుకూడా ఆధ్యాత్మిక విషయాలను బోధిస్తున్నారేమిటి?" అని అనుకుంటున్నారు. చిన్నవారుగాని, పెద్దవారుగాని, మధ్యవయస్కులు గాని, ఎవరికైనా ఇది అత్యవసరం.

బాల్యంబునందున పలువురితోకూడి
ఆటపాటలయందు ఐక్యుడగును
యవ్వనంబలరిన అలరువిల్తుని పోల్కి
కామినీలోలుడై క్రాలుచుండు
అర్థ వయస్సున ఐహికంబున మున్గి
ద్రవ్యమార్జించుట దవిలియుండు
ముదిమి వచ్చినయంత మురహరి తలవక
అది యిది లేదని అలమటించు
వివిధ దర్వ్యసనంబులు వీడలేక
భక్తిమార్గంబు వెదకు నాసక్తి లేక
కర్మపంకిలమున బడి క్రాలుచుండు
మట్టి కల్పును జన్మంబు మానవుండు

యౌవనంలో ఇంద్రియశక్తిని పాడుచేసుకొని వృద్ధాప్యంలో దేవుడా, దేవుడా అని దేవులాడితే

sri sathyasai vachanamrutam

ప్రయోజనమేమిటి? Start Early, drive Slowly, reach Safely. లేత వయస్సునందే ఆధ్యాత్మిక మార్గంలో ప్రవేశించాలి.

**వైరాగ్యమనగా దేహాభిమానమును తగ్గించుకోవటం**

విద్యార్థులారా! విద్యార్థినులారా! ఈ లోకంలో ఎన్ని శక్తులను మీరు చూస్తున్నారో, ఎన్ని శక్తులనుగురించి మీరు వింటున్నారో, చదువుతున్నారో ఆ శక్తులన్నీ మీయందే ఉంటున్నాయి. మీలో లేనివి ఇంకొకరిలో లేవు. మీలో లేనివాటిని బయట ఎక్కడా చూడటానికి వీలుకాదు. బయిటిదంతా రిఫ్లెక్షన్, రియాక్షన్, రీసౌండ్ మాత్రమే. ప్రతి మానవుడూ దైవసమానుడే! ఈ సత్యాన్ని మీరు గుర్తించుకున్నప్పుడు ఇంక ఎన్నడూ దుఃఖానికి గురికారు. దేహాభిమానం పెరిగేకొలదీ దుఃఖంకూడా పెరుగుతుంది. కనుక దేహాభిమానమును తగ్గించుకోవాలి. దీనినే వేదాంత పరిభాషలో వైరాగ్యమన్నారు. వైరాగ్యమంటే అన్నీ వదలిపెట్టి అడవికి పోవటం కాదు. అన్నింటియందు ఏకత్వాన్ని దర్శించాలి. రూపనామములను మీరే కల్పించుకుంటున్నారు. కల్పించుకున్నవి ఏదో ఒకనాడు కనిపించకుండా పోతాయి.

**లౌకిక, ఆధ్యాత్మిక విద్యలు రెండూ అవసరమే**

విద్యార్థినీ విద్యార్థులారా! ఈనాడు మీరు చదివే చదువులన్నీ తెచ్చిపెట్టుకున్నవేగాని, మీతోపాటు పుట్టినవి కాదు. అయితే ఇవి భౌతిక లోకానికి అవసరమే. కాని ఎంతవరకు అవసరమో అంతవరకే పెట్టుకోవాలి.

చదివి వ్రాయనేర్చినవారంతా విద్యావంతులేనా?
కాలేజి డిగ్రీలు పొంద విద్యావంతుడగునా?
సద్భావములు, సద్బుద్ధిలేక విద్యలు సద్విద్యలగునా?
బ్రతుకుటకే విద్యయన్న బ్రతుకలేవె పశుపక్షులు!

విద్య జీవితంకోసమే గాని, జీవించటంకోసం కాదు. జీవించటం కోసమే విద్య అయితే ఎందుకిన్ని అవస్థలు? ఏ విద్యలూ ఎఱుగని పశుపక్షిమృగాదులు హాయిగా జీవిస్తున్నాయి కదా! మానవులై పుట్టినందుకు మీరు మహత్తరమైన దివ్యశక్తిని గుర్తించాలి. అనుభవించాలి, ఆనందించాలి. ఆ ఆనందాన్ని పదిమందికి పంచాలి. అలాంటి చదువును మీరు చదవాలి.

srisathyasai vahamrutam

లౌకికమైన చదువులుకూడ అవసరమే. లేకపోతే మేమెందుకు విద్యాసంస్థలను స్థాపిస్తాము? "ఇహమున సుఖింప హేమతారక విద్య, పరమున సుఖింప బ్రహ్మవిద్య" ఈ లౌకిక విద్యలన్నీ దేహానికి తోడ్పడే విద్యలేగాని, జీవితానికి తోడ్పడేవి కాదు. ఇవి ఆత్మతత్త్వాన్ని గుర్తింపజేసేవి కాదు. ఆత్మతత్త్వాన్ని గుర్తింపజేసేదే నిజమైన చదువు. దానిని మించిన చదువు మరొకటి లేదు.

ఈనాడు స్నాతకోత్సవం. మీరు పట్టములను అందుకుంటున్నారు. దేనికోసం? కేవలం పొట్టను పోషించుకోవటానికా? విద్య కేవలం పొట్టకూటి కోసం కాదు. అయితే మీయందు మనోభావం ఉన్నంతవరకు ఈ లౌకిక విద్యలను మీరు అభ్యసించవలసిందే! మనోభావం తొలగిననాడు ఈ విద్యలు మీకు అక్కర్లేదు. మనస్సుతో కూడినది మానవత్వం. మనస్సు పోయిన తరువాత ఉండేదే మాధవత్వం. దీనినే విదేశీయులు Cosmic Power అని వెల్లడి చేస్తున్నారు. ఈ సత్యాన్ని వారు నేడు తెలుసుకున్నారుగాని, భారతీయులు ఏనాడో తెలుసుకున్నారు. కాని, ఏమి ప్రయోజనం? తెలుసుకున్న సత్యాన్ని ఆచరణలో పెట్టలేక పోతున్నారు. ఆచరణ ద్వారానే ఆత్మతత్త్వాన్ని గుర్తించటానికి వీలవుతుంది.

**అంతరాత్మను అనుసరించినప్పుడే జన్మధన్యము**

ఈనాటి మానవుడు ఎవరిని చూసినా 'నీవెవరు?' అని ప్రశ్నిస్తున్నాడు. దానికి బదులు 'నేనెవరు?' అని తనను తాను ప్రశ్నించుకోవాలి. అప్పుడే తన విలువను తాను తెలుసుకోగలడు. తానెవరో తెలియకుండా ఇతరుల గురించి తెలుసుకొన్న తరువాత అందరిగురించి తెలిసిపోతుంది. ఎందుకంటే తనయందున్న తత్త్వమే అందరియందూ ఉన్నది. తనయందున్న దివ్యశక్తిని గుర్తించిన తరువాత తనకు ఎట్టి దుఃఖమూ, ఎట్టి విచారమూ ఉండదు. నన్ను చూడండి. నాకెట్టి దుఃఖమూ లేదు, ఎట్టి విచారమూ లేదు. నా జీవితమే నా సందేశము. అనేకమంది "స్వామీ! హ్యాపీ బర్త్‌డే" అని చెబుతున్నారు. నేనెప్పుడు ఆనందంగానే ఉన్నాను. కాబట్టి నాకు మీరు చెప్పనక్కర్లేదు. ఆనందంగా లేనివారికి ఆనందాన్నివ్వండి. దేహాలు వస్తుంటాయి, పోతుంటాయి. కదలిపోయే మేఘాలను చూసి బెదురుకోవడమెందుకు? దేహమొక నీటి బుడగ. మనస్సొక పిచ్చికోతి. కాబట్టి, దేహాన్ని, మనస్సును అనుసరించకండి. మీ అంతరాత్మను అనుసరించండి. అదే మీ జీవితానికి గమ్యము. అప్పుడే మీ జన్మధన్యము.

srisathyasaivachanamrutam

## అహంకారాన్ని త్యజిస్తే మానవుడే దేవుడు

ప్రతిమానవుడు ఆనందం కావాలని ఆశిస్తాడు. అయితే ఆనందము తనయందే ఉన్నది. దేహము అన్నమయ కోశము. తరువాత వరుసగా ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ కోశములున్నాయి. ఆనందమయమే తన గమ్యం. బాల్య, యౌవన, కౌమార, వార్ధక్య దశలలో దేహస్థితిలో మార్పు వస్తున్నది గాని, దేహంలో ఉన్న తాను మారిపోవటం లేదు కదా! బాల్యంలో ఎవరు నీవు? అంటే 'నేను' అంటాడు. యౌవనంలో ఎవరు నీవు? అంటే 'నేను' అంటాడు. ఆ 'నేను' ఎవరో తెలుసుకోవాలి. ఇంగ్లీషులో దీనిని I అన్నారు. దీనిని 'కట్' చేస్తే, అది క్రైస్తవ మత చిహ్నమైన 'క్రాస్ (+) అవుతుంది. అనగా దేహమే 'నేను' అనే అహంకారాన్ని కొట్టివేస్తే తానే దేవుడైపోతాడు. అహంకారాన్ని కొట్టివేస్తే తానే దేవుడై పోతాడు. అహంకారమున్నచోట ప్రేమ ఉండటానికి వీలుకాదు. కనుక అహంకారమునకు అవకాశం ఇవ్వకండి. దేహం పెరుగుతుంది, తరుగుతుంది. దీనిని కేవలం ఒక పనిముట్టుగా భావించండి.

మనస్సును వశం చేసుకోండి. మీరు చదవవలసిన చదువులు చదువుకోండి. జీవనోపాధికి ఇవికూడ అవసరమే. అంతేకాకుండా, మీ తల్లిదండ్రులు మీపై ఎన్నో ఆశలు పెట్టుకొని ఉంటారు. వారిని ఉద్ధరించే నిమిత్తం మీరు చదవాలి. ఈ చదువులతోపాటు ఆధ్యాత్మిక తత్త్వాన్నికూడా అభివృద్ధిపరచుకోవాలి. అప్పుడు మీరు నిరంతరము ఆనందంగా ఉంటారు. దుఃఖమునకు కించిత్తైనా అవకాశం ఉండదు. మీ దేహాన్ని కనిపెంచి అన్ని విధాలుగా అభివృద్ధిపరచింది మీ తల్లిదండ్రులే కదా! కనుకనే వేదము "మాతృదేవో భవ, పితృదేవో భవ" అని బోధించింది. వారిని దైవ స్వరూపులుగా భావించండి; వారిని సంతృప్తి పరచండి. మిమ్మల్ని ఏదో గొప్ప విద్యను నేర్చుకొమ్మని నేను చెప్పటంలేదు. మీరు నేర్చుకున్న విద్యను ఆచరణలో పెట్టి, ఆనందాన్ని అనుభవించండి; పదిమందికి ఆదర్శంగా నిలవండి.

## దేహాభిమానమే ఏకత్వానికి అడ్డుగోడ

మన కేంద్రమంత్రి మురళీమనోహర్ జోషి ఎంతో గొప్ప చదువు చదివాడు. ఈనాడు ఆయన మీకు ఎన్నో మంచి విషయాలు బోధించాడు. కాని వాటిని మీరు ఎంతవరకు అర్థం చేసుకున్నారు? ఏ ఒక్కటి మీరు అర్థం చేసుకొని ఆచరణలో పెట్టినా చాలు. ఊరును కాల్చాలంటే అగ్గిపుల్లలు ఎన్నో అవసరం లేదు; ఒక్క అగ్గిపుల్ల చిక్కినా చాలు. అదేరీతిగా ఈ జగత్తులో

sri sathyasai vahini.org

ఉన్నది ఒక్కటే అని గుర్తిస్తే చాలు, అన్నింటినీ మీరు సాధించవచ్చు. అట్టి ఏకత్వాన్ని గుర్తించటానికి దేహమే మీకు అడ్డు తగులుతోంది. మీరొక పెద్ద భవనాన్ని నిర్మించుకున్నారు. అందులో డ్రాయింగ్‌రూము, డైనింగ్‌రూము, బాత్‌రూము మొదలైనవన్నీ వేరువేరుగా కనిపిస్తున్నాయి. ఎందువల్ల? మధ్యలో గోడలు ఉండటంవల్ల. ఆ గోడలను కొట్టివేస్తే అంతా ఒకే రూమ్‌గా కనిపిస్తుంది. అదేరీతిగా, మీరు దేహాభిమానమనే అడ్డుగోడలను కొట్టివేసినప్పుడే మీకు ఏకత్వం గోచరిస్తుంది.

**ప్రభుత్వం ఉచిత విద్యావిధానం ప్రవేశపెట్టాలి**

ఇక్కడ మన మినిష్టర్‌గారున్నారు కాబట్టి, ఒక విషయం చెబుతున్నాను. విద్యార్థులను సరియైన మార్గంలో అభివృద్ధిపరచాలంటే వారికి ఉచిత విద్యనందించాలి. మా విద్యా సంస్థలో విద్యార్థులకు ట్యూషన్ ఫీజుగాని, ఎగ్జామినేషన్ ఫీజుగాని, గేమ్స్ ఫీజుగాని ఎలాంటి ఫీజు లేదు. ఇక్కడికి వట్టి చేతులతో వస్తున్నారు; జ్ఞానమనే గట్టిమూటను ఎత్తుకొనిపోతున్నారు. అంతేగాక వినయమును, విశ్వాసమును అభివృద్ధిపరచుకుంటున్నారు. విద్య వినయమును పెంచాలి. ఈనాడు బయటి విద్యార్థులలో వినయం లేకుండా పోవడానికి కారణమేమిటి? వారు ఫీజులు కడుతున్నారు. కనుకనే ఇష్టమెచ్చినట్లు ప్రవర్తిస్తున్నారు. అధికారులు వారిని పల్లెత్తు మాట అనటానికి వీల్లేకుండా ఉంది. అంతేగాక ఈనాడు సరస్వతీ పర్ణశాలలైన విద్యాసంస్థల్లో లక్ష్మీదేవి తిష్ఠవేసుకొని కూర్చుంది. అడ్మిషన్‌కి డబ్బు, అటెండెన్స్‌కి డబ్బు, పరీక్షలకి డబ్బు చివరికి పాస్ కావటానికి కూడా డబ్బే! నా ఉద్దేశ్యమేమంటే, విద్యార్థులకు ప్రభుత్వం విద్యను ఉచితంగా అందిస్తే చాలా బాగుంటుంది. ప్రభుత్వం ఎన్నో కోట్లు ఖర్చు పెడుతున్నది. విద్యార్థులనుండి ఫీజు తీసుకున్నంత మాత్రాన వారికి పెరిగే ఆదాయమేమి లేదు. అయ్యే ఖర్చులు ఎలాగైనా అవుతున్నాయి. కాబట్టి విద్యను ఉచితంగా ఇవ్వండి. దానివల్ల పిల్లలు బాగుపడతారు. ఈనాటి 'ఎడ్యుకేషన్' (విద్య) 'ఎజిటేషన్' (ఆందోళన) కు దారితీస్తోంది. దీనికి అవకాశం ఇస్తున్నది ఎవరు? ప్రభుత్వమే! ప్రభుత్వం విద్యార్థులతో సన్నిహిత సంబంధమును పెంచుకోవాలి. దీనికి ఉచిత విద్యను అందించటమొక్కటే మార్గం. మా పిల్ల నెవరినైనా మీరు ప్రశ్నించండి, ఎవరి దగ్గరా మేము నయాపైసా పుచ్చుకోవడం లేదు. ఉచిత విద్యతోపాటు మేము కొందరికి స్కాలర్ షిప్‌లు కూడా ఇస్తున్నాము. నిజంగా చెబుతున్నాను, మా పిల్లలు

srisathyasaivachanamrutam

బంగారంవంటి పిల్లలు. స్వామిని వదలిపోవుటకు వారు ఇష్టపడరు. చాలామంది ఖ.ఐబీ., ఖఔజు పూర్తి చేసిన తరువాత కూడా ఇక్కడే ఆనీ.ఈ చేయాలని ఆశిస్తారు. ఎందుకంటే, స్వామి దగ్గర ఇంకా కొన్ని సంవత్సరాలు ఉండాలన్నది వారి ఉద్దేశ్యం. మా పిల్లల్లో వారు తీసుకునే డిగ్రీలకు తగిన గొప్ప గుణమున్నది; గుణమునకు తగిన పరివర్తన ఉన్నది; పరివర్తనకు తగిన ప్రవర్తన ఉన్నది.

**(22.11.2000 సాయంత్రం సాయికుల్వంత్ సభామండపంలో శ్రీవారు అనుగ్రహించిన దివ్య సందేశము**

sri sathyasai vachanamrutam